నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, సోమవారం 10 మార్చి 2025 YADADRI BHUVANAGIRI

## పలువురికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ



చిన వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి, మార్చి 9: నల్లగొండకు చెందిన ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన వెంకట్‌రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యం, కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ నాయకుడు కూతురు లక్ష్మారెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# తడి ఆరింది.. మడి ఎండింది

## నల్లగొండ నియోజకవర్గంలో అడుగంటిన భూగర్భజలాలు.. ఎండుతున్న వరి పొలాలు



నల్లగొండ రూరల్ : అప్పాజిపేటలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలం

**ఏఎమ్మార్పీ ద్వారా సాగు నీరందక**

**తిప్పర్తి మండలంలో వాడుతున్న పంట చేలు**

**అప్పాజీపేటలో ట్యాంకర్లతో నీరు అందిస్తున్న వైనం**

**అప్పలెట్ల తీర్చాలని ఆందోళనలో అన్నదాతలు**

నల్లగొండ రూరల్, మార్చి 9 : కేసీఆర్ సర్కార్ పాలనలో పదేండ్లుగా మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు నిండుకుండలా ఉండడంతో పంటలకు పుష్కలంగా నీరు అందేది. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఈ ఏడాది చెరువులు ఒట్టిపోవడంతోపాటు బోర్లు అడుగంటిపోయాయి. జల వనరులు అడుగంటి.. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. నల్లగొండ నియోజకవర్గంలో యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు పొట్ట దశలో నిలువునా ఎండిపోతుండడంతో అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. ఏఎమ్మార్పీ కింద ఉన్న డీ-40 ఎల్-11 ద్వారా చుక్క నీరు రాకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో మామిడాలలో మెజార్టీ పొలాలు ఎండుతున్నాయి. దాంతో వేలకు వేలు పెట్టుబడి పెట్టి నాట్లు వేసిన అన్నదాతలు బోరుమంటున్నారు. ఏటా వేల ఎకరాల్లో వరి, నిమ్మ, బత్తాయి ఇతర పంటలు పండించే అప్పాజీపేటలో ఈ యాసంగిలో సాగు ప్రశ్నార్థకంగా మారింది. పొట్ట దశలో ఎండుతున్న పొలాలకు చివరి ప్రయత్నంగా ట్యాంకర్లతో నీళ్లు పెడుతున్న పరిస్థితి నెలకొంది.

### అప్పాజీపేటలో ఎండుతున్న పంట చేలు

నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామంలో సాగు విస్తీర్ణం మూడు వేల ఎకరాలు ఉండగా.. అందులో 1300కు పైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అయితే.. బ్రాహ్మణ వెల్లెంల నుంచి డిస్ట్రిబ్యూటరీల ద్వారా అప్పాజీపేట చెరువు నింపాల్సి ఉన్నా ఔరవాణిలో భూములు నష్టపోతున్న రైతులకు పరిహారం ఇవ్వకపోవడతో వారు నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని కాకి చెరువుతోపాటు మరో చెరువు నీళ్లలేక అడుగంటిపోయాయి. దాంతో 15రోజుల క్రితం నిండుగా పోసిన బోర్లు ఆగిఆగి పోస్తున్నాయి. ఇదే సమయంలో లోవోల్టేజీ విద్యుత్ సమస్యతో మోటార్లు కాలిపోయాయి. ఫలితంగా ఇప్పటికే సుమారు వంద నుంచి 150ఎకరాలకు పైగా వరి పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. మరో వంద ఎకరాలకు పది రోజులు నీరు అందిస్తే పంట చేతికొచ్చే ఆవకాశం ఉంది. లేదంటే అవి కూడా ఎండిపోనున్నాయి. ఎండిన పొలాలను రైతులు పశువుల మేతకు వదిలేశారు. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందకు వాటర్ ట్యాంకర్లతో నీళ్లు అందిస్తుండగా, మరి కొందరు కొత్తగా బోర్లు వేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి అయినా దక్కుతుంతో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా బ్రాహ్మణవెల్లెంల డిస్ట్రిబ్యూటరీల ద్వారా చెరువును నింపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### 30 వాటర్ ట్యాంకర్లతో నీళ్లు పెట్టా



నాకున్న రెండెకరాల 11 గుంటల వ్యవసాయ భూమిలో వరి వేసిన. ఇప్పుడు రెండు బోర్ల నుంచి చుక్క నీళ్లు వస్తలే. ఇప్పటికే ఎకరం పొలం పూర్తిగా ఎండిపోయింది. మిగతాది చేతికి వచ్చేందుకు 20 రోజులు పడుతది. ఈ పంటను కాపాడుకునేందుకు ఇప్పటి వరకు 30 వాటర్ ట్యాంకర్ల నీళ్లు అందించా. సమీపంలో ట్యాంకర్ నీళ్లు అందించే వసతి కూడా లేదు. మా అన్నల పొలం కూడా పూర్తిగా ఎండిపోయింది. బర్లు, గొడ్లను మేపుతున్నాం. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

**- ఓరుగంటి వెంకన్న, రైతు, అప్పాజిపేట, నల్లగొండ మండలం**

### ఎండుతున్న మామిడాల



తిప్పర్తి : మామిడాల గ్రామంలో ఎండిన వరి పొలం

తిప్పర్తి : ఏఎమ్మార్పీ కింద ఉన్న డీ-40 ఎల్ 11 ద్వారా చుక్క నీరు రాకపోవంతోపాటు భూగర్భ జలాలు అడుగంటడంతో తిప్పర్తి మండలంలోని మామిడాల ఎండతుంది. బోర్లు పోయకపోవడంతో మెజార్టీ పొలాలు ఎండుతున్నాయి. దాంతో వేలకు వేలు పెట్టుబడి పెట్టిన అన్నదాతలు బోరుమంటున్నారు. పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు బోర్లు వేసినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచక రైతులు ఆగమాగం అవుతున్నారు. చేసేదేమీ లేక పంట పొలాలను గొర్లు, బర్లకు మేతకు ఇస్తున్నారు. డీ-40 సబ్ కాల్వల ద్వారా కొంత మేర నీటి సరఫరాకు అవకాశం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఆడపాదడపా వస్తున్నాయని, కాల్వ నీళ్లు వస్తే కొంత మేర బోర్లు పెరిగి పంటలు దక్కేవని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు సర్వే చేసి ఎండిన పంటలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, పంట సమయానికి ఆర్థికంగా సహాయం అందేదని రైతులు చెప్తున్నారు.



### పొలం ఎండడంతో బర్రెను మేపుతున్నా

నాకు 5ఎకరాల పొలం ఉంది. మూడు బోర్లు ఉన్నాయి. పొలం ఈతపట్టింది. ఇప్పుడు బోర్లు సరిగా పోయకపోవడంతో మొత్తం ఎండింది. కాల్వ నీళ్లను కూడా రానిస్తలేరు. కాల్వ వస్తే కొంత ఎండిపోకుండా ఉండేది. చేసేదేమీలేక బర్రెను మేపుతున్నా. అధికారులు పట్టించుకొని కాల్వ వచ్చేటట్టు చేయాలి.

**- అంజయ్య, రైతు, మామిడాల, తిప్పర్తి మండలం**

### నాలుగెకరాల పొలం ఎండిపోయింది



నా భర్త లేకున్నా నా ఇద్దరు కుమారులతో కలిసి నాలుగెకరాల పొలం పెట్టాను. 6బోర్లు వేస్తే ఒక్కటి మాత్రమే పోస్తుండేది. అది కూడా కొన్ని రోజుల నుంచి చిన్నచిన్నగా తగ్గి మొత్తం పోయింది. దాంతో పొలం మొత్తం ఎండిపోయింది. అప్పుజేసి రూ.50వేల దాకా పెట్టుబడి పెట్టాను. కొసకు అది ఎండిపోయింది. చేసేది లేక గొర్రెలకు మేతకు ఇచ్చాను. పొలం ఎండిపోవడంతో నా పెద్ద కుమారుడు మిర్యాలగూడకు పనికి పోతుండు. ఇంతకుముందు మంచిగుండేది. రైతుబంధు వచ్చేది. ఇప్పుడు ఏ బంధూ లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

**- కోడదల కళమ్మ, మామిడాల, తిప్పర్తి మండలం**

### కోతకు ముందే గొర్రెల మేతకు



మోటకొండూర్ మండల కేంద్రంలో ఎండిన పైరు మేస్తున్న గొర్రెలు

**మోటకొండూర్‌లో నీళ్లు లేక ఎండిన వరిపొలాలు**

మోటకొండూర్ : ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే సరిపడా నీరులేకపోవడంతో వరిపంట మొత్తం ఎండిపోయింది. రైతులు చేసేదేమిలేక వరి పొలాన్ని గొర్రెల మేతకు వదిలారు. మోటకొండూర్ మండలం చాడ మధిర గ్రామ పంచాయతీ బెజ్జంకి బావికి చెందిన సలేంద్ర సోములు, బెజ్జంకి రాంరెడ్డితో పాటు మరో రైతు కలిసి 12 ఎకరాల భూమిని మోటకొండూర్ మండల కేంద్ర పరిధిలో కౌలుకు తీసుకున్నారు. ఎకరాకు రూ.25వేలు ఖర్చు చేసి వరిపంట వేశారు. వరినాటు కోసం డబ్బులు అప్పుగా తెచ్చి సాగుచేస్తే భూగర్భజలాలు అడుగంటడంతో పంట మొత్తం ఎండి పోయింది. చేసేదేమీ లేక వరిపైరును గొర్రెల మేతకు వదిలేశారు. తెచ్చిన అప్పు మీదపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కనుల పండువగా లక్ష్మీనరసింహుడి రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి9 : యాదగిరిగుట్ట దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి కల్యాణ లక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన రథంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలు, మామిడి, అరటి తోరణాలతో స్వామివారి దివ్య విమాన రథాన్ని శోభాయమానంగా అలంకరించి విశ్వక్సేనుడికి పూజలు చేశారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల అభరణాలతో లక్ష్మీనారసింహస్వామిని దివ్య మనోహరంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దివ్య విమాన రథంపై ఊరేగించారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని విహరించిజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. బ్రహ్మోత్సవ తిరుకల్యాణ లక్ష్మీనరసింహ స్వామిని ఉదయం బంగారంతో తీర్చిదిద్దిన గరుఢ వాహనంపై ఊరేగించారు. నిత్య హవనం, వేద పారాయణాలు నిర్వహించారు. కలెక్టర్ హనుమంతరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు, వేదపారాయణదారులు, రుత్వికులు, పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు పుష్ప యాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం నిర్వహించనున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

## రేవంత్‌రెడ్డి బ్రోకర్ పాలనలో ఎమ్మెల్యే సామేల్ జోకర్ చేష్టలు

- **కమీషన్ల కక్కుర్తితో గత పనులను జరుగనియ్యడం లేదు**
- **బీఆర్‌ఎస్ పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి**

మోత్కూరు, మార్చి 9 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్రోకర్ పాలన చేస్తుంటే.. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మందుల సామేల్ జోకర్ చేష్టలు చేస్తున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దత్తప్పగూడెంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్‌ను, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిని తిడుతున్నారన్నారు. తల్లి లాంటి బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను తిట్టడం సరికాదని హితవు పలికారు. ఎమ్మెల్యే సామేల్, ఆయన కొడుకులు కమీషన్లకు ఎగబడి నియోజకవర్గ అభివృద్ధిని కుంటుపడేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తీసుకొచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎమ్మెల్యే సామేల్ తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి చూపెట్టాలని సవాల్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బిల్లులు పాస్ చేయడానికి 20 శాతం కమీషన్లు తీసుకుంటుంటే తుంగతుర్తిలో ఎమ్మెల్యే సామేల్ కమీషన్లకు తట్టుకోలేక కాంట్రాక్టర్లు పారిపోతున్నారని అన్నారు. అందుకు నియోజకవర్గంలో ఆగిపోయిన పనులే నిదర్శనమని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు బిక్కేరు వాగులోకి వదిలిన కాళేశ్వరం జలాలకు పూలు చల్లి పూజలు చేస్తున్నారని తెలిపారు. దోసెడు ఇసుకను పోనివ్వనని ఎన్నికల్లో చెప్పిన ఎమ్మెల్యే సామేల్.. ఇప్పుడు తన కొడుకులతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని విమర్శించారు. మోత్కూరు మున్సిపాలిటీ, సింగిల్‌విండో చైర్మన్లపై అవిశ్వాసం పెట్టి సాధించిందేమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన రూ.10 కోట్లతోనే సీసీ రోడ్లు, ఇతర పనులు జరిగాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే మోత్కూరు మున్సిపాలిటీకి రూ.50కోట్లు మంజూరు చేయించాలని సవాల్ చేశారు. సింగిల్ విండోలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన వారు నేటికీ ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. సింగిల్‌విండోలో ఉన్న నిధులన్నీ చిరు వ్యాపారుల పేరిట కాంగ్రెస్ కార్యకర్తలకు రుణాలు ఇచ్చి ఒక్క రూపాయి కూడా ఇన్‌స్టాల్‌మెంట్ చేయించలేదన్నారు. రెండు గదుల రిపేరుకు రూ.12లక్షల బిల్లులు చేసింది బయట పెడ్తామన్నారు. తాము సాధారణ ఖర్చుల కోసం సంవత్సరానికి రూ.50వేలు ఖర్చు చేస్తే.. ఇప్పుడున్న కాంగ్రెస్ చైర్మన్ సంవత్సరంలోనే రూ.5లక్షల ఖర్చులు చూపెట్టారని తెలిపారు. రైతుల సొమ్మును దుబారా చేసి సంఘాన్ని ఆగం చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, సహకార సంఘం డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, దేవసరి రాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీల మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేందర్‌నాథ్, నాయకులు నాగయ్య, కొండ సోంమల్లు, మల్లేశ్, నర్సయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

## నేడు ప్రణయ్ హత్య కేసు తుది తీర్పు

మిర్యాలగూడ/రామగిరి, మార్చి 9 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు విచారణ తుది దశకు చేరింది. ఇప్పటికే వాదనలు పూర్తికాగా కోర్టు సోమవారం తుది తీర్పు ఇవ్వనుంది.


తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుపారి గ్యాంగ్‌తో అమృత తండ్రి మారుతీరావు 2018 సెప్టెంబర్ 14న అమృత భర్త ప్రణయ్‌ను మిర్యాలగూడ పట్టణంలో హత్య చేయించాడు. ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి ఫిర్యాదు మేరకు మారుతీరావుతోపాటు మొత్తం 8 మంది నిందితులపై కేసు నమోదు చేసి మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి పూర్తి చేశారు. కేసు విచారణ నడుస్తుండగానే ఏ1 నిందితుడైన మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా నల్లగొండలో నేడు రెండో అదనపు సెషన్స్ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు ఈ కేసులో తుది తీర్పు వెల్లడించనుంది. తుది తీర్పుపై ప్రణయ్ కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## పంట ఎండింది.. పశువులకు మేతైనా మిగులుతుందని..

- వరిపైరుకు స్ప్రేతో నీళ్లు చల్లుతున్న రైతు



ఆలేరు టౌన్ : ఆలేరు మండలం కొనుపాకలో మందులు పిచికారీ చేసే దానితో వరి చేనుకు నీళ్లు కొడుతున్న రైతు మామిడాల సోమయ్య



ఎండి పోయిన బావి

ఆలేరు టౌన్, మార్చి 9 : ఆలేరు మండలం కొనుపాక గ్రామానికి చెందిన రైతు మామిడాల అంజయ్య గత సంవత్సరం మాదిరిగా తన 6 ఎకరాల్లో వరి నాటు వేశాడు. జనగామ జిల్లాలోని బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి సాగు నీళ్లు వస్తాయని అనుకున్నాడు. రిజర్వాయర్ నుంచి నీళ్లు రాకపోవడంతో వేసిన 6 ఎకరాల వరి చేను ఎండిపోయింది. దిక్కుతోచని స్థితిలో కనీసం పశువుల మేతకు అయిన గడ్డి వస్తుందనే ఉద్దేశంతో రోజూ రెండు ట్యాంకర్లు పెట్టి వరి చేనుకు నీళ్లు పోస్తున్నాడు. నీళ్లు మొత్తం సరిపోవనే ఉద్దేశంతో మందు పిచికారీ చేసే పరికరంతో తానే చేనులో నీళ్లు స్ప్రే చేస్తున్నాడు. పంట చేతికి వస్తుందని ఆశతో సాగు చేస్తే తీరా ఇలా జరిగిందని, పెట్టుబడి, శ్రమ వృథా అయ్యిందని రైతు అంజయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## ఎమ్మెల్సీ అభ్యర్థులు నలుగురు జిల్లా వాసులే..

- **బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్**
- **కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, శంకర్ నాయక్**
- **సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం**



దాసోజు శ్రవణ్ కుమార్

నల్లగొండ ప్రతినిధి మార్చి 9 (నమస్తే తెలంగాణ). ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటివరకు ఆయా పార్టీలు ప్రకటించిన ఐదుగురు అభ్యర్థుల్లో నలుగురు అభ్యర్థులు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఇప్పుడు వరకు ప్రకటించిన అభ్యర్థులు విజయశాంతి మినహా మిగతా నలుగురు జిల్లాకు చెందిన వారే. గతంలో ఎప్పుడూ ఇలాంటి సందర్భం లేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన ఏకైక అభ్యర్థి దాసోజు శ్రవణ్ కుమార్ నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి. విద్యార్థి ఉద్యమాల నుంచే క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ తెలంగాణ ఉద్యమంలో కలిసి నడిచారు. దీనితో పార్టీ అధినేత కేసీఆర్ శ్రవణ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరూ ఉమ్మడి జిల్లాకు చెందిన వారే. దామరచర్ల మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌ను ఎస్టీ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏఐసీసీ ప్రకటించింది. ఇక మరో అభ్యర్థి అద్దంకి దయాకర్ కూడా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన వ్యక్తే. మాల మహానాడు నేతగా గుర్తింపు పొంది కాంగ్రెస్‌లో చేరి రెండు సార్లు తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో తన సీటును త్యాగం చేయడంతో ప్రస్తుతం ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. ఇక గతంలో కుదిరిన ఎన్నికల పొత్తులో భాగంగా ఒక స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ సీపీఐకి కేటాయించింది. సీపీఐకి ఇచ్చిన స్థానం కూడా నల్లగొండ జిల్లా వ్యక్తికే దక్కడం విశేషం. సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న నెల్లికంటి సత్యం కూడా శాసనమండలిలో అడుగు పెట్టడం ఇక లాంచనమే కానుంది. మునుగోడు మండలం ఎలగలగూడెనికి చెందిన సత్యం సీపీఐలో కింది నుంచి జిల్లా కార్యదర్శి వరకు ఎదిగి వచ్చారు. గత ఎన్నికల్లో మునుగోడు అసెంబ్లీ స్థానం కోసం పొత్తులో భాగంగా పట్టుపట్టారు. అప్పుడు పార్టీ నిర్ణయం మేరకు వెనక్కి తగ్గడంతో ప్రస్తుతం ఎమ్మెల్సీగా చట్టసభల్లో అడుగు పెట్టబోతున్నారు.



శంకర్ నాయక్



అద్దంకి దయాకర్



నెల్లికంటి సత్యం

## మూల్యాంకనం పారితోషికమేది?

- **గతేడాది ఎస్‌ఎస్‌సీ స్పాట్ వ్యాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి అందని ప్రోత్సాహకం**
- **ఏడాదిగా ఎదురుచూస్తున్న 1,550 మంది టీచర్లు**
- **నిధులు విడుదల చేయకపోతే త్వరలో జరుగబోయే స్పాట్‌ను బహిష్కరిస్తామని హెచ్చరిక**



రామగిరి, మార్చి 9 : పాఠశాల దశలో పదో తరగతి కీలక ఘట్టం. వార్షిక పరీక్షల నిర్వహణ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) చేస్తారు. గతేడాది మార్చిలో జరిగిన పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్‌లో చేశారు. ఆ విధుల్లో పాల్గొన్న స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జిలు, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, గెజిటెడ్ హెడ్మాస్టర్స్, స్కూల్ అసిస్టెంట్స్, స్పెషల్ అసిస్టెంట్(ఎస్‌జీటీలు, సీఆర్‌పీలు)లకు ఇవ్వాల్సిన పారితోషకంపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీంతో నల్లగొండ జిల్లాలో వివిధ హోదాల్లో మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న సుమారు 1,550 మంది ఉపాధ్యాయులు పారితోషికం కోసం ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ నెల 21న పదో తరగతి పరీక్షలు మొదలు కానుండగా ఏప్రిల్‌లో మళ్లీ మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఈలోగా గత సంవత్సరం నిధులు ఇవ్వాలని, లేని పక్షంలో స్పాట్ వాల్యుయేషన్ బహిష్కరిస్తామని పలువురు ఉపాధ్యాయులతోపాటు తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు.

**పారితోషికం ఇలా..**

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు వారి హోదాల ఆధారంగా ప్రభుత్వం పారితోషికం అందజేస్తుంది. సీఈలుగా పనిచేసిన వారికి 9 రోజులుకుగానూ ఒక్కరికి రూ. 7,284, ఏఈలకు రూ. 9వేలకుపైగా, స్పెషల్ అసిస్టెంట్లకు రూ. 2, 475 ఇవ్వాలి. స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జిలు, ఇతర హోదాల్లో పనిచేసిన వారికి వీరి కంటే అదనంగా రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉంది.

### త్వరలో రెమ్యునరేషన్ ఇవ్వాలి



గత సంవత్సరం పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న టీచర్స్, సిబ్బందికి వెంటనే రెమ్యునరేషన్ అందజేయాలి. ఎండాకాలంలో సైతం స్పాట్‌కు హాజరై మూల్యాంకనం చేస్తే ఇప్పటికీ ఇవ్వకపోవడం బాధాకరం. అధికారులను అడిగితే ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని చెప్తున్నారు. నిధులు వస్తాయని ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా దీనిపై వనతి పత్రం అందజేశాం. త్వరలో వాటిని విడుదల చేయకపోతే టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో త్వరలో జరుగబోయే స్పాట్ వాల్యుయేషన్స్ బహిష్కరిస్తాం.

**- నిమ్మనగోటి జనార్దన్, జిల్లా అధ్యక్షుడు, టీఆర్‌టీఎఫ్ నల్లగొండ**